పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టంగా జరగాలి

డీ-సిల్టింగ్, చెత్త సేకరణ, ప్లాస్టిక్ నియంత్రణ, బయోమెట్రిక్ హాజరుపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

డివిజన్ల వారీగా పారిశుధ్య నిర్వహణపై కమిషనర్, అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష

హనుమకొండ, జులై 16(వాయిస్ టుడే): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, నగర పరిశుభ్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు, బయోమెట్రిక్ హాజరు, ప్లాస్టిక్ నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై డివిజన్ల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ పరిధిలో పాయింట్ ఆఫ్ సేల్ (పూూ) మెషీన్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదాయ వసూళ్లలో పారదర్శకత తీసుకురావాలని, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి..

వర్షాకాలంలో మురుగునీరు నిల్వ కాకుండా నగరంలోని అన్ని అంతర్గత మురుగుకాలువల్లో 100 శాతం డీ-సిల్టింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట యంత్రాలతో పాటు గ్యాంగ్‌మెన్‌లను వినియోగించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నగరంలో ప్రతిరోజూ కనీసం 400 టన్నుల ఘన వ్యర్థాల సేకరణ జరిగేలా శానిటరీ సూపర్వైజర్లు, జవాన్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పారిశుధ్య వాహనాలు, కంటైనర్లు, ట్రాక్టర్లు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూడాలని, మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తి చేసి పారిశుధ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి..

తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా సేకరించాలని, ప్రస్తుతం తడి చెత్త సేకరణ ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ దానిని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నాలుగు మోడల్ కాలనీల్లో అమలు చేస్తున్న విధానాన్ని సమీక్షిస్తూ తదుపరి సమావేశం నాటికి తడి చెత్త సేకరణ వ్యవస్థను పూర్తిగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అన్ని స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ మ్యాపింగ్ పూర్తి చేసి, ప్రతిరోజూ కేటాయించిన ప్రాంతాలను 100 శాతం కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఘన వ్యర్థాల నిర్వహణ (ూఖెవీ)పై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ప్రతి స్వచ్ఛ ఆటో రోజుకు కనీసం రెండు ట్రిప్పులు చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు చెత్త తరలించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

వ్యర్థాల నిర్వహణలో వినూత్న చర్యలు..

వ్యర్థ కొబ్బరి బొండాలను వినియోగిస్తూ కోకో కాయర్ యూనిట్ల ఉత్పత్తి పెంచాలని, అలాగే 15 ఖూాణ, 150 ఖూాణ సామర్థ్యాల ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల (ఖీూూ) నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రతిరోజూ డీ-స్లడ్జింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్ నియంత్రణ - ప్రజల భాగస్వామ్యం అవసరం..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహించాలని, అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్రజలను ప్లాస్టిక్ రహిత జీవనశైలికి ప్రోత్సహించేలా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, ఎక్సైజ్ కాలనీ మార్కెట్ వద్ద ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను అందజేసే వారికి బట్ట సంచులు, నిత్యావసర వస్తువులు లేదా ప్రోత్సాహక నగదు అందించే విధానాన్ని రూపొందించాలని సూచించారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం..

నగరంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఫ్లైఓవర్లు, బండ్ ప్రాంతాల్లో ప్రకృతి పరిరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతను ప్రతిబింబించే నేచర్-బేస్డ్ వాల్ ఆర్ట్, ప్రేరణాత్మక సందేశాలతో కూడిన పెయింటింగ్స్ రూపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు..

నివాస ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, హసన్‌పర్తిలో రెండో ఏబీసీ (Animal Birth Control) కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సూచించారు. లాండ్రోమార్ట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, మురుగు కాలువల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వల్ చర్యలను ముమ్మరం చేయాలని, ఏ ప్రాంతంలోనైనా వ్యాధులు ప్రబలితే అక్కడ ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి వెంటనే ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆస్కీ ప్రతినిధి రాజమోహన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌దే..

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, అరూరి రమేష్, నన్నపనేని నరేందర్

రేవంత్ రెడ్డి టీడీపీకి ప్రతిరూపం.. ఎమ్మెల్యే నాయిని రేవంత్‌కు ప్రతిరూపం

బీఆర్ఎస్ నాయకుల విమర్శ

హనుమకొండ, జూలై 16(వాయిస్ టుడే): మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసిందని..ఇప్పుడు ఆ ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకోవడం సరికాదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపనేని నరేందర్ విమర్శించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ తరువాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో నిర్మించబడిందని, దాని అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారని తెలిపారు. ఉడాన్ (ఖణూాచీ) పథకం అమలు సమయంలో కూడా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిగాయని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థలతో చర్చలు జరిపి 1.8 కిలోమీటర్ల రన్‌వేను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 3.8 కిలోమీటర్లకు విస్తరించే లక్ష్యంతో రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని వివరించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు ఢిల్లీ వెళ్లిన తెలంగాణకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. మామునూరు ఎయిర్‌పోర్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ జరిగిందని తెలిపారు. 253 ఎకరాల భూసేకరణకు అప్పటి కేబినెట్ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ కారణంగా నియామకాలు నిలిచిపోయాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం రూ.500 కోట్లతో భూసేకరణ చేపట్టామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సరికాదని, దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ మామునూరు ఎయిర్‌పోర్టును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరమన్నారు. భూసేకరణకు అనుమతులు ఇచ్చింది ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. దేశంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి టీడీపీకి ప్రతిరూపమని, నాయిని రాజేందర్ రెడ్డి రేవంత్‌కు ప్రతిరూపమని విమర్శించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరని హెచ్చరిస్తూ మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి పునాది వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నాయకులు నార్లగిరి రమేష్, సదానందం గౌడ్, మసూద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందించాలి

బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి

విద్యార్థినులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసిన కలెక్టర్

ఫిజిక్స్ పాఠ్యాంశం పై విద్యార్థులలో అవగాహన

హనుమకొండ: జులై 16(వాయిస్ టుడే): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, సులభంగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం ఉదయం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థినులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్..

విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా అందిస్తున్న మైసూర్ బోండాను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ప్రతిరోజూ అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, పోషకాహార ప్రమాణాలతో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం..

ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన కలెక్టర్ ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఫిజిక్స్ పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసి వాటిపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినికి సులభంగా అర్థమయ్యే విధంగా అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలాగే నీట్, జేఈఈ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అజ్మీర గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరు రైతుల దుర్మరణం

పాల్వంచ: ద్విచక్రవాహనాన్ని బస్సు, ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు రైతులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకెళితే.. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన ఈసం జనార్దన్(45), తేజావత్ దుదియా(45)తో కలిసి డ్రిప్ ఇరిగేషన్ పైపులకు అమర్చే ట్యాప్‌ల కోసం గురువారం ద్విచక్రవాహనంపై పాల్వంచకు వచ్చారు. వీటిని కొనుగోలు చేసి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. నవభారత్ సమీపంలోకి రాగానే భోజనం చేసేందుకని ఓ హోటల్‌కు వెళ్లడానికి యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కొత్తగూడెం నుంచి భద్రాచలం వెళ్తున్న భద్రాచలం ఆర్టీసీ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి 20-30 మీటర్లు ఈడ్చుకెళ్లింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. జనార్దన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె దుదియాకు భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతదేహాలను పాల్వంచ సీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరు రైతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రైవేట్ పాఠశాల టీచర్...

ఖమ్మం : ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయిని అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం ఖమ్మం నగరంలో గురువారం చోటుచేసుకుంది. ఖమ్మం రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం.. అజీజ్‌గల్లీలో నివసించే షేక్ రెహానా(35) ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా పాఠశాలకు వెళ్తున్న క్రమంలో ఆమె బైక్‌ను పాత బస్టాండు కూడలి వద్ద ఖమ్మం డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. వాహనంపై నుంచి కిందపడ్డ రేహానా మీదుగా బస్సు వెనుక టైరు వెళ్లటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. రెహానా భర్త ఎండీ అజీముద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కల్లూరు: కల్లూరు పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం తెల్లవారుజామున లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై హరిత కథనం మేరకు.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మేరుగు గోపి(28) తన ద్విచక్రవాహనంపై కల్లూరు నుంచి నారాయణపురానికి వెళ్తున్నాడు. సత్తుపల్లి నుంచి వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. అతడికి గాయాలు కావడంతో కల్లూరు పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఏపీ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా తల్లపుడి మండలం అల్లదేవరపేటకు చెందిన లారీ డ్రైవర్ గంగుల శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.